ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యం

- అర్హులందరికీ వైఎస్సార్ పింఛన్ కానుక
- బనగానపల్లె నియోజకవర్గంలో ప్రతి నెలా రూ.10.84 కోట్ల పంపిణీ
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి


పింఛన్ సొమ్ము అందజేస్తున్న ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి


కార్యక్రమానికి హాజరైన కొత్తగా మంజూరైన పింఛన్ లబ్ధిదారులు

బనగానపల్లెరూరల్: ప్రజా సంక్షేమం, అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యనిస్తుందని, పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. పార్టీలు, కులమతాలు,వర్గాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు నేరుగా అందజేస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. ఎంపీడీఓ శివ రామయ్య అధ్యక్షతన గురువారం స్థానిక పొదుపు భవనంలో కొత్తగా మంజూరైన 681 మందికి వివిధ రకాల వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి అతిథులుగా హాజరైన ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము, పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బనగానపల్లె నియోజక వర్గంలో గత టీడీపీ పాలనలో 30,747 మందికి మాత్రమే పింఛన్ ఉండేదని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కేవలం నాలుగేళ్లలోనే 39,432 మందికి అందజేస్తున్నామన్నారు. పింఛన్ లబ్ధిదారులకు ప్రతి నెలా రూ.10.84 కోట్లను వలంటీర్ల ద్వారా ఇంటి వద్దకే వెళ్లి పంపిణీ చేస్తున్నారని గుర్తు చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వ పథకాలు అమలు చేస్తూ... పట్టణాలతో సమానంగా గ్రామాల్లో మౌలిక వసతులు కల్పిస్తూ అభివృద్ధి పనులు చేపడుతుంటే టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మకు మాత్రం కనిపించడంలేదన్నారు. బనగానపల్లె పట్టణంలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న రూ.22 కోట్లతో నిర్మించిన ఏరియా ప్రభుత్వ వైద్యశాల, రూ.4 కోట్లతో ఆర్టీసీ బస్టాండ్ నుంచి జీఎంటాకీస్ వరకు జరుగుతున్న ఫోర్‌లైన్స్ నిర్మాణం, శాశ్వత తాగునీటి సమస్య పరిష్కారానికి సుమారు 2.50లక్షల నీటి సామర్థ్యం కలిగిన రెండు మంచినీటి ట్యాంకులు నిర్మాణం తదితరాలు వారికి కనిపించకపోవడం హాస్యాస్పదమన్నారు. పేదలకు ఏ మాత్రం మంచి జరిగినా టీడీపీ మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్‌రెడ్డి సహించలేడని, బనగానపల్లె పట్టణంలో మూడువేల మంది పేదలకు పంపిణీకి సిద్ధంగా ఉన్న ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమంతో పాటు కొలిమిగుండ్ల మండలంలో పేదలకు చేపట్టిన భూ పంపిణీని కోర్టు ద్వారా స్టేపొంది అడ్డుకున్నారని విమర్శించారు.

సీఎంను ఎదుర్కోలేకనే వ్యక్తిగత ఆరోపణలు : జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందజేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రోజురోజుకు ప్రజాభిమానం పెరుగుతుందని, ఓర్వలేని టీడీపీ నాయకులు రాజకీయంగా ఎదుర్కోలేక వ్యక్తిగత ఆరోపణలకు పాల్పడుతున్నారని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి విమర్శించారు. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో చంద్రబాబు, లోకేష్...... వైఎస్ జగన్ కంటే ఎక్కువగా అమ్మ ఒడి, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో రాయితీ, సంవత్సరానికి మూడు సిలిండర్లు అంటూ ప్రజలను మళ్లీ మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ మానసవీణ, జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, మండల ఉపాధ్యక్షురాలు ఎం లక్ష్మీదేవి, ఈఓ ఖలీల్, పట్టణ సర్పంచ్ ఈసారి యల్లమ్మ, మార్కెట్ యార్డు చైర్మన్ దీవెనమ్మ, జిల్లా వైఎస్సార్ సీపీ యువజన విభాగం అధ్యక్షుడు గుండంనాగేశ్వరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ సభ్యులు అబ్దుల్‌ఫైజ్, యాగంటి ఆలయ చైర్మన్ తొట బుచ్చిరెడ్డి, నాయకులు బండి బ్రహ్మానందరెడ్డి, జనార్దన్‌రెడ్డి, మోహన్‌బాబు, ఈశ్వర్‌నాయక్, పుల్లయ్యశెట్టి, రమణ, వెంకట్రామిరెడ్డి, డాక్టర్ మహమ్మద్‌హుస్సేన్, అల్లె సురేష్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, శివరామిరెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మగిసిన పెద్ద రాజు స్వామి ఉరుసు


గంధం సమర్పిస్తున్న పీఠాధిపతి

బేతంచెర్ల: మండల పరిధిలోని గూటుపల్లె గ్రామంలో వెలసిన పెద్ద రాజు స్వామి ఉరుసు వేడుకలు గురువారం జియారత్‌తో ముగిశాయి. జియారత్ వేడుకలను పురస్కరించుకొని పీఠాధిపతి గురు సయ్యద్ అక్బర్ బాషా ఖాద్రీ, దర్గా నిర్వాహకులు గురు సయ్యద్ షా బాషా ఖాద్రీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేసి, దర్గాలో జియారత్ గంధం సమర్పించారు. తరువాత కిస్తీ వేడుకలను ప్రారంభించారు. అనంతరం వచ్చిన 7 రకాల పకీర్ల(హప్సగిరో) బందారు పంపిణీతో ఉరుసు ఉత్సవాలు ముగిశాయి. జిల్లా నుండే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణా రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున్న భక్తులు హాజరై దర్గాను దర్శించుకుని ఫాతెహాలు సమర్పించారు.

నేడు డయల్ యువర్ డీఎం

బనగానపల్లె : స్థానిక ఆర్టీసీ డిపోలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ రవికిశోర్ తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రయాణికులు, ప్రజలు సమస్యలు, సూచనలను 99592 25802 నంబర్‌కు తెలుపాలని డీఎం కోరారు.

క్లుప్తంగా

పేదల ఆరోగ్యం కోసం జగనన్న సురక్ష

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యం కోసం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని జిల్లా మలేరియా అధికారి కామేశ్వరరావు అన్నారు. గురువారం పట్టణంలోని ఆరోగ్య కేంద్రం -3 లో వైద్యురాలు తస్లిమా ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ఆశావర్కర్లు, ఆరోగ్య సిబ్బందికి ఒక్క రోజు శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 15 వతేదీ నుంచి వార్డు వలంటీర్లు, ఆశా కార్యకర్తలు, సచివాలయ ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధులు కలవారిని గుర్తించి వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనంతరం కనుమకింది కొట్టాల గ్రామాన్ని సందర్శించి, డెంగీ వ్యాధి కేసును పరిశీలించారు. అక్కడ నీటి తొట్లలో దోమ లార్వాలు ఉన్న నీటిని పారబోయించారు. కార్యక్రమంలో పట్టణ మలేరియా సబ్ యూనిట్ అధికారి వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి భరోసా

కోవెలకుంట్ల: ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తోందని ఎంపీడీఓ సయ్యదున్నిసా, డాక్టర్ రాబర్ట్‌కెన్నెడి అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాయలూరు పీహెచ్‌సీ పరిధిలోని ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లకు కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వైద్య సదుపాయాలు కలిప్పించడమే లక్ష్యమన్నారు. నెల 30వ తేదీ నుంచి నలుగురు డాక్టర్లతో గ్రామాల్లో హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈఓఆర్‌డీ రాధిక, సీహెచ్‌ఓ లింగమ్మ, హెల్త్ సూపర్‌వైజర్లు మునిస్వామి, పద్మావతి పాల్గొన్నారు.

బీసీలకు అధికారం వస్తేనే వ్యవస్థలో మార్పు

కొలిమిగుండ్ల: బీసీలకు అధికారం వస్తేనే వ్యవస్థల్లో మార్పు వస్తుందని, ఆ దిశగా తన పోరాటం సాగుతుందని జాతీయ సమసమాజం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏపీ రామయ్య యాదవ్ అన్నారు. గురువారం కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్‌హాల్‌లో నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు రాజ్యాధికారం సాధించేందుకు రాజకీయంగా చైతన్యవంతులు కావాలని పిలుపునిచ్చారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలను ఐక్యత చేసేందుకు కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణమూర్తి, లింగన్న, సంజామల మోహన్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా క్రీడా పోటీలు

కొలిమిగుండ్ల: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంకిరెడ్డిపల్లె ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో ఏర్పాటు చేసిన క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగాయి. పోటీలను గురువారం ఎంఈఓలు రాజయ్య, అబ్దుల్‌కలాం ప్రారంభించారు. ఎంఈఓ రాజయ్య విద్యార్థులతో కలసి కొద్ది సేపు కబడ్డీ ఉత్సాహ పర్చారు. అండర్-14,అండర్-17 విభాగంలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్‌బాడ్మింటన్, పరుగు పందెం, యోగా తదితర పోటీలు నిర్వహించారు.

ఉచితంగా మట్టి వినాయకుల విగ్రహాలు

డోన్ టౌన్ : పర్యావరణ పరిరక్షణలో భాగంగా వినాయక చవితి పర్వదినాన పూజలు నిర్వహించేందుకు ఉచితంగా మట్టితో తయారు చేసిన గణపయ్య విగ్రహాలను అందజేస్తున్నట్లు శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్త పాతాళం సుబ్బారావు తెలిపారు. స్థానిక దేవాలయంలో ఈ నెల 17వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటల నుంచి ఉచితంగా మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఒక్కో కుటుంబానికి ఓ విగ్రహం అందజేస్తామని, భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకో పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని కోరారు.

ఈకేవైసీ తప్పనిసరి

అవుకు: పంట నమోదు చేసుకున్న రైతులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయాలని ఏఓ అబ్దుల్ హక్ తెలిపారు. మండల పరిధిలోని గుండ్లశింగవరం, అన్నవరం, చెర్లోపల్లె గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాలను గురువారం ఏఓ సందర్శించి రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులు సాగు చేసిన పంట పొలాల వద్దకే వెళ్లి ఈ క్రాప్ బుకింగ్‌ను పరిశీలించారు. కొత్తగా పాస్ బుక్‌లు వచ్చిన రైతులు ఆర్బీకేల వద్ద వైఎస్సార్ రైతు భరోసా పథకానికి నమోదు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు స్టీఫెన్, ప్రవీణ్ కుమార్,జెబా బక్తియార్ పాల్గొన్నారు.

ముగిసిన శ్రీకృష్ణాష్టమి వేడుకలు

కోవెలకుంట్ల: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను పుష్కరించుకుని పట్టణంలో ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ప్రారంభమైన శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు గురువారం ముగిశాయి. చివరి రోజు శ్రీకృష్ణ భగవానుని పూజ, భగవద్గీత శ్లోకాలు తదితర కార్యక్రమాలు జరిగాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి కర్రా హర్షవర్దన్‌రెడ్డి, మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పూజలు నిర్వహించారు. శ్రీకృష్ణుని విగ్రహాన్ని పుర వీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు జనార్దన, ఉపాధ్యక్షులు సుబ్బరాయుడు, రామసుబ్బారెడ్డి, సభ్యులు మధుసూదన, సుబ్బారావు, సుధాకర్, చౌడయ్య, వెంకటరమణ, రామసుబ్బయ్య, లీలావతి, ఆదిలక్ష్మి, సుగుణ పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు


పింఛన్ నగదు అందజేస్తున్న ఎంపీపీ, గ్రామ నాయకులు

బేతంచెర్ల: అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందిస్తూ పేదల ఆర్థిక అభివృద్ధి కోసం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆర్ ఎస్ రంగాపురం గ్రామంలో గురువారం పంచాయతీ కార్యదర్శి కృష్ణమూర్తి, గ్రామ సర్పంచ్ గుమ్మగాల్ల రాజు, ఎంపీటీసీలు నాగశేషు, వెంకటలక్షమ్మ ఆధ్వర్యంలో కొత్తగా పింఛన్లు మంజూరైన 46 మందికి వైఎస్సార్ పెన్షన్ కానుకను ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం జెడ్పీ హైస్కూలును సందర్శించి, విద్యార్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని సంజీవనగర్, హనుమాన్ నగర్ కాలనీలకు కొత్తగా మంజూరైన పింఛన్లను వార్డు కౌన్సిలర్స్ నాగజ్యోతి, మహేశ్వరి, కాలనీ వైఎస్సార్‌సీపీ నాయకులు వలీబాషా, నిరంజన్, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు యమసాని జగన్ మోహన్ రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తిమోత్తి పాల్గొన్నారు.

డోన్ టౌన్: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కౌన్సిలరు మహేశ్వరరెడ్డి అన్నారు. ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను గురువారం పట్టణంలోని సచివాలయంలో ఆయా వార్డుల కౌన్సిలర్లు లబ్ధిదారులకు అందజేసారు. ఇందులో భాగంగా 8వ సచివాలయంలో కౌన్సిలరు మహేశ్వరరెడ్డి, 30వ వార్డులో కౌన్సిలరు ఆర్ట్ రమణలో లబ్ధిదారులకు పింఛన్ సొమ్ము అందజేశారు. కార్యక్రమాల్లో సచివాలయాల సంక్షేమ అధికారులు నాగేశ్వరరావు, అలివేలు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని చింతలాయిపల్లెలో కొత్తగా మంజూరైన పింఛన్‌లను గురువారం వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. సచివాలయ పరిధిలో 21 మందికి పింఛన్ మంజూరైనట్లు ఆయన చెప్పారు. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వం పింఛన్ మంజూరు చేస్తుందని ఆయన తెలిపారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని కమలాపురం గ్రామంలో గురువారం గ్రామ సర్పంచ్ అర్జున్‌రెడ్డి చేతుల మీదుగా కొత్తగా వచ్చిన పింఛన్‌లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంకా అర్హత ఉండి పింఛన్‌లు రాని వారు ఉంటే గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

హిందీ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

ప్యాపిలి : విద్యార్థులు హిందీ భాష పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని పీఆర్ పల్లి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీధర్ అన్నారు. స్థానిక పాఠశాలలో గురువారం హిందీ బాసా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హిందీ ఉపాధ్యాయురాలు సరోజమ్మను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజకుల్లాయప్ప, చంద్రమోహన్, నాగరాజు, చాముండేశ్వరి, లిల్లమ్మ, శ్యామల, మమత, కృష్ణవేణమ్మ, లక్ష్మీనారాయణ,రంగనాయకులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: జాతీయ భాష హిందీ నేర్చుకుంటే ఎంతో ప్రయోజనం కలుగుతుందని సీనియర్ ఉపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, సురేష్‌బాబు, హిందీ ఉపాధ్యాయులు భారతిబాయి, సుబ్బారెడ్డిలు అన్నారు. హిందీ దివస్ పురష్కరించుకొని పాతపేట హైస్కూల్లో గురువారం ఘనంగా హిందీ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయునిగా ఇటీవల అవార్డు అందుకున్న సురేష్‌బాబును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాలు శివప్రసాద్, వెంకటరమణ, మధుసూధనరెడ్డి, లక్ష్మయ్య, వెంకటలక్ష్మీ, రాధ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ.మోడల్ స్కూల్లో : హిందీ దివాస్‌ను స్థానిక ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ నాగ జాస్మిన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

మున్సిపాలిటీ అభివృద్ధిలో డోన్‌దే అగ్రస్థానం


ఆర్‌అండ్‌బీ వసతి గృహం వద్ద నంద్యాల మున్సిపల్ చైర్‌పర్సన్ మాబునిసా

డోన్ : మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో డోన్ మున్సిపాలిటీ అభివృద్ధిలో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలిచిందని నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ షేక్ మాబునిసా అన్నారు. గురువారం ఆమె మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, కమిషనర్ వెంకటరామిరెడ్డిలతో కలిసి మున్సిపల్ పరిపాలన భవనం, ఆర్‌అండ్‌బీ గెస్టహౌస్, క్లబ్ హౌస్, కూరగాయ మార్కెట్, వందపడకల ఆసుపత్రి, ఇండోర్ స్టేయం, రోడ్ల వెడల్పు, ఫ్లైఓవర్, అండర్ పాస్ బ్రిడ్జి, ప్రభుత్వ ఐటీఐలో విద్యార్థుల వసతి గృహం, కియా నాలెడ్జ్ సెంటర్‌లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పులివెందుల మున్సిపాలిటీ తరువాత డోన్ అభివృద్ధిలో అగ్రగామిగా ఉంటుందని అనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.

చట్టం ముందు అందరూ సమానులే

- టీడీపీ నాయకులు న్యాయవ్యవస్థను కించపర్చేలా మాట్లాడటం తగదు
- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి


మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: చట్టం ముందు అందరూ సమానులేనని, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆధారాలతో సహా అవినీతికి పాల్పడినట్లు దొరికిపోవడంతోనే రిమాండ్‌కు వెళ్లాల్సి వచ్చిందని జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. రిలే నిరాహార దీక్షలో మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి చేసిన విమర్శలపై జెడ్పీ చైర్మన్ స్పందించారు. గురువారం కొలిమిగుండ్లలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రిలేనిరాహార దీక్షలు, ధర్నాలు, బంద్‌లు అనేవి ప్రజల అవసరాలు, రైతుల సమస్యలు తదితరాలపై పార్టీల తరపున చేపడితే ప్రజలు హర్షిస్తారని, అయితే టీడీపీ నాయకులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారన్నారు. అవినీతి కేసులో చంద్రబాబు జైలుకు పోతే రిలే నిరాహార దీక్షలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆధారాలతోనే సీఐడీ అధికారులు సమర్పించాకే కోర్టు పూర్తి స్థాయిలో పరిశీలించి తీర్పు ఇచ్చిందన్నారు. చంద్రబాబు అవినీతి చేయలేదని ఏవరూ మాట్లాడం లేదని,కేవలం సాంకేతిక కారణాలపై మాత్రమే మాట్లాడుతున్నారన్నారు. తమకు అనుకూలంగా తీర్పు రాక పోవడంతో ఏకంగా న్యాయవ్యవస్థను టీడీపీ నాయకులు నిందించడం తగదన్నారు. చంద్రబాబును నంద్యాలలో అరెస్ట్ చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఎక్కడా పెద్దగా స్పందన కనిపించలేదన్నారు. 14 ఏళ్ల పాటు సీఎంగా ఉన్న సమయంలో వ్యవస్థలను మేనేజ్ చేస్తు అక్రమాలకు పాల్పడుతూ వచ్చాడని ప్రజలు బలంగా నమ్మారన్నారు. బాబు రాజకీయ జీవితమంతా అవినీతి మయం అని ఆరోపించారు.

బీసీ... వాస్తవాలు తెలుసుకో

మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దనరెడ్డి వాస్తవాలు తెలుసుకోకుండా మాట్లాడం మంచిది కాదని జెడ్పీ చైర్మన్ సూచించారు. తప్పుడు కేసులు పెట్టి తమ నాయకులను వేధిస్తున్నారని చెప్పడంలో వాస్తవాలు లేవన్నారు. 2014-19 వరకు ఉన్న టీడీపీ ప్రభుత్వ పాలనలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు బనాయించి వేధించిన ఘనత మీదే అని విమర్శించారు. సబ్సిడీ శనగ విత్తనాలను టీడీపీ నాయకులు పక్కదారి పట్టిస్తే వైఎస్సార్‌సీపీ నాయకులు ధర్నా చేస్తే వారిపై కేసులు నమోదు చేయించడంతో ఏడేళ్ల పాటు కోర్టు వెంట తిరిగారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, హనుమంతుగుండం సొసైటీ అధ్యక్షుడు మూల ఈశ్వరరెడ్డి, వైస్ ఎంపీపీ క్రిష్టారెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, పులి ప్రకాష్‌రెడ్డి, గుర్విరెడ్డి, నారాయణరెడ్డి, బాచం మహేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోండి

సంజామల: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ నాగకుమార్ సూచించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, పంచాయితీ కార్యదర్శిలతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడారు. గ్రామాల్లోని ప్రతి ఇంటినీ సందర్శించి ప్రజల ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి పేర్లు నమోదు చేయాలన్నారు. 30వ తేదీ నుంచి చేపట్టే మెగా మెడికల్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకునేలా ప్రజలను చైతన్య పరచాలని సూచించారు. కార్యక్రమంలో సంజామల, నొస్సం పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్స్ వినోద్ కుమార్, శ్రీకాంత్, సుధా, ఈఓఆర్డీ పాపరాయుడు తదితరులు పాల్గొన్నారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

బనగానపల్లెరూరల్: అవుకు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన అమడాల తిమ్మయ్య(31) చికిత్స పొందుతూ కోలుకోలేక కర్నూలు ప్రభుత్వ వైద్యశాలలో మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజ నేయరెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 10న మండలంలోని బీరవోలులోని బంధువు ఇంటికి మోటార్ సైకిల్‌పై బంధువు పక్కిరయ్యతో కలిసి వెళ్లాడు. తిగి బీరవోలు గ్రామ నుంచి స్వగ్రామం చెర్లోపల్లెకు ఇద్దరు మోటార్ సైకిల్ పై బయల్దేరారు. చెరువుపల్లె గ్రామ సమీపంలో ముందుగా వెళ్తున్న ట్రాక్టర్‌ను క్రాస్ చేసేందుకు ప్రయత్నించే కార్యక్రమంలో కిందపడడంతో అమడాల తిమ్మయ్య తలకు గాయమైంది. దీంతో మెరుగైన చికిత్స కోసం కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడి తండ్రి మద్దిలేటి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు


బుక్‌లెట్ అందజేస్తున్న నాయకులు

బేతంచెర్ల: సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడి అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వాల్మీకి ఫెడరేషన్ డైరెక్టర్ మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, శేఖరయ్య, తిరుమలేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని తహసీల్‌పేట కాలనీల్లో నగర పంచాయతీ కమిషనర్ రమేష్ బాబు, కౌన్సిలర్ ఇబ్రహీం, కో ఆప్షన్ సభ్యుడు సునీల్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సారథ్యంలో విద్య, వైద్య రంగాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి వర్తించిన సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు అందజేశారు. నలభై సంవత్సరాల్లో జరగని అభివృద్ధి వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో జరిగిందన్నారు. ప్రజల వద్దకే పాలన కొనసాగించేందుకు మరోమారు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వాదించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మగ్బుల్, శ్రీను, సద్దాం పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, సీపీఐ మద్దతు కుటుంబాలు


శ్రీరాములు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరుతున్న టీడీపీ, సీపీఐ కార్యకర్తలు

డోన్ : మండలంలోని తిమ్మాపురం గ్రామానికి చెందిన టీడీపీ, సీపీఐ మద్దతు కుటుంబాలు గురువారం మీట్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, వైఎస్సార్‌సీపీ బీసీ యువజన విభాగం రాష్ట్ర కార్యర్శి సీలం భాస్కర్‌నాయుడు సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో తిమ్మాపురం గ్రామానికి చెందిన లక్ష్మన్న, రాజ్, రమణయ్య, బలరాముడు, నాగన్న, వెంకటాచలం, గురుస్వామి, షేక్షా, వెంకటరాముడు, రవి, రామచంద్రుడు, రాజశేఖర్, నాగరాజు, ఉమాశంకర్‌లతోపాటు మరో 36 కుటుంబాల సభ్యులకు శ్రీరాములు వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

గణేష్ ఉత్సవాలను విజయవంతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లెరూరల్: వినాయ చవితి ఉత్సవాల్లో అన్నిశాఖల అధికారులందరూ సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సూచించారు. గురువారం బనగానపల్లె మండల, పట్టణ కేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధశాఖ అధికారులతో గణేష్ ఉత్సవాల ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు. ఉత్సవ కమిటీ కార్యనిర్వాహ అధ్యక్షులు న్యాయవాది మాధవరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. గణేష్ మండపాలకు సంబంధించి కమిటీలుగా ఏర్పడి, గణనాథుల ఏర్పాటుకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. బనగానపల్లె పట్టణంలో ఈ నెల 22న గణేష్ నిమజ్జన కార్యక్రమం ఉంటుందని, పోలీసులు అవసరమైన అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ శివరామయ్య, ఆర్‌అండ్‌బీ డీఈఈ సునీల్‌రెడ్డి, బనగానపల్లె, నందివర్గం ఎస్ఐలు వీరాంజనేయులు, రామాంజనేయరెడ్డి, అగ్నిమాపకశాఖ అధికారి నరసింహులు తదితరులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా జరుపుకోవాలి

బేతంచెర్ల: ఈనెల 18 నుంచి జరిగే వినాయక చవితి ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సీఐ ప్రియతం రెడ్డి, గణేష్ కేంద్ర ఉత్సవ సమితి అధ్యక్షులు హుసేన్‌రెడ్డి తెలిపారు. గురువారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ రమేష్ బాబు, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి ఆధ్వర్యంలో కేంద్రగణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, విగ్రహాలు నెలకొల్పే నిర్వాహకులతో సమావేశం నిర్వంహించారు. ఈ సందర్భంగా వారు విగ్రహాలు ఏర్పాటు మొదలుకొని, నిమజ్జనం వరకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈనెల 21వ తేదీన నిమజ్జనం రోజున తప్పనిసరిగా సమయపాలన పాటించాలని, డీజేలకు అనుమతి లేదని సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మహబూబ్‌వలీ, ఆర్ఐ శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు గుండా గోపాలు, బుగ్గన చంద్రమౌళీశ్వర్‌రెడ్డి, కందగడ్డల మోహన్, వీరారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక సెయింట్ జోసఫ్స్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి చందు అదృశ్యమయ్యాడు. గురువారం ఎస్ఐ వెంకటరెడ్డి అందించిన సమాచారం మేరకు.. నంద్యాల పట్టణంలోని నందమూరినగర్ కాలనీకి చెందిన నిర్మల కుమారుడు చందు కోవెలకుంట్లలోని జోసఫ్స్ స్కూల్‌లో చదువుతూ అక్కడే హాస్టల్‌లో ఉంటున్నాడు. బుధవారం ఉదయం స్కూల్ బ్యాగులో బట్టలు సర్దుకుని హాస్టల్ నుంచి స్కూల్‌కు బయలుదేరాడు. స్కూల్ వద్దకు రాగానే హాస్టల్‌లో టిఫిన్ చేయలేదని, బయట తిని వస్తానని తోటి స్నేహితులతో చెప్పి అక్కడి నుంచి పట్టణంలోకి వచ్చి తిరిగి పాఠశాలకు వెళ్లలేదు. రెండు రోజులైనా స్కూల్, హాస్టల్‌కు రాకపోవడంతో అనుమానం వచ్చి ఉపాధ్యాయులు విద్యార్థి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. బంధువులు, స్నేహితుల ఇళ్ల వద్ద గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

గాడిచెర్ల సేవలు చిరస్మరణీయం


గాడిచెర్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

కోవెలకుంట్ల: గ్రంథాలయ పితామహుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు 140వ జయంతి వేడుకలను కోవెలకుంట్ల పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. రిటైర్డ్ గ్రంథాలయాధికారి నరసింహారెడ్డి ఆధ్వర్యంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సుధాకర్, రాయలసీమ స్టూడెంట్ యూనియన్ నాయకుడు ఓబులేసు తదితరులు స్థానిక లైబ్రరీ ఆవరణలో ఏర్పాటు చేసిన గాడిచెర్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రంథాలయాల అభివృద్ధికి గాడిచెర్ల ఎంతగానో కృషి చేశారన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం నారాయణస్వామి, ఎల్ఐసీ ఏజెంట్ శ్రీనివాసరెడ్డి, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

16న బహిరంగవేలాలు

బనగానపల్లె: మండలంలోని యాగంటి క్షేత్రంలోని శ్రీ ఉమామహేశ్వరస్వామి ఆలయ ఆవరణలో భక్తుల సౌకర్యార్థం టెంకాయల అమ్ముకునే హక్కు కోసం బహిరంగ వేలాలనుఈ నెల 16న నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి చంద్రశేఖర్‌రెడ్డి గురు వారం తెలిపారు. వేలంలో డిపాజిట్ చెల్లించి పాల్గొనాల్సి ఉంటుందని ఈఓ తెలిపారు.

ఆర్టీసీ యూనియన్ల గుర్తింపుపై హర్షాతిరేకాలు

డోన్ టౌన్ : ప్రజా రవాణ వ్యవస్థ (ఆర్టీసీ) యూనియన్లను గుర్తిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేయడంతో కార్మికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు గురువారం స్థానిక డిపో వద్ద యూనియన్ నాయకుల ఆధ్వర్యంలో కార్మికులు సంబరాలు చేసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌ఎంయూ డిపో అధ్యక్ష కార్యదర్శులు సీతరామిరెడ్డి, బాలమద్దయ్య, గ్యారేజ్ కార్యదర్శి మాధవస్వామి, ఎంప్లాయిస్ యూనియన్ డిపో అధ్యక్ష కార్యదర్శులు మౌలాలీ, రమణారెడ్డి, డిపో ఏడీసీ చంద్ర, కోశాధికారి చాంద్‌బాషా, నాయకులు రామకృష్ణ, మల్లికార్జున, నాగార్జున, స్వామి తదితరులు పాల్గొన్నారు.